కథానిక

# చిరకాల వాంఛ

వి. దుర్గాకుమారి

ఆ వార్త విన్నప్పుడు నాకు ఏమాత్రం ఆశ్చర్యం కలుగలేదు. అసలు శారద ఎప్పుడో ఒకప్పుడు అలాంటి పని చేస్తుందనే నేననుకుంటూ వచ్చాను. సాధ్యమయినంత వరకూ వారించాలనే చూచాను కాని ప్రయోజనం లేకపోయింది. ఆమె స్వభావమే చాలా విచిత్రమైనది. ఎవ్వరితో మాట్లాడదు. కాని తనకు మంచివాళ్లు, తన అభిరుచులకు అనుగుణంగా ప్రవర్తించేవారు అయినట్లయితే ఆడ, మగ, తన పర భేదమే లేకుండా చాలా కలివిడిగా వుంటుంది. ఇక తనకు నచ్చని ప్రవర్తన గలవారితో ముభావంగానే ఉంటుంది. అసలు వారి ప్రాంతాలకే రాదేమో! నలుగురు కూర్చున్నచోట కూర్చోదుకదా! ఒకవేళ ఎవరైనా ఏమయినా అనుకుంటారని (అనుకున్నా లక్ష్యంలేదనుకోండి) మర్యాదకోసం కూర్చున్నా వెంటనే లేచిపోతుంది. అలాంటి ప్రవర్తనకలిగి ఉన్నందుకు ఆమె అంటే చాలా మందికి కోపం. అందువలన ఆమె గొప్పతనానికి ఏమీ భంగంలేదు. తనకు ఏది మంచిపని అని తోస్తే అపనే చేస్తుంది. పోతే...ఎదుట స్తుతించి చాటున నిందించేవారిని చూస్తే తగని కోపం. మనసులో ఎంత ఉంటే అంత నిర్మొహమాటంగా, నిర్భయంగా మొహాన్నే అడిగేస్తుంది. ఇది చాలామందికి గిట్టదు. తత్ఫలితంగా శారదకు 'పెంకిపిల్ల, పొగరుబోతు, పెడసరపుకట్టె, గర్విష్ఠి'-యిత్యాది బిరుదులు అయాచితంగా లభిస్తూ ఉంటాయి. లభించాయికూడా! ఇతరుల దయకోసం, కటాక్ష వీణాలకోసం పూసుకు తిరగటం, ముఖస్తుతి చేయటం ఆమెకు గిట్టవు.

కాని భగవంతుడు తన సృష్టిలో ఎప్పుడూ పొరపాటు చేయడు. సముద్రంలో బడబాగ్నిని ఎందుకు సృజించాడు? అదే లేకపోతే ప్రపంచం యిలా ఉంటుందా? ఏనాడో సాగరునిలో లీనమయ్యేది. అలాగే అంతటి స్వతంత్ర భావాలుకల స్త్రీ వ్యక్తికి సర్వసౌఖ్యాలూ ప్రసాదిస్తే అతని గొప్పతనమేముంది? అందుకే శారదను బీదల యింట్లో పుట్టించాడు. పోనీ అందరు బీదవాళ్ళకు మల్లే అలావుంచినా బాగుండేది. ఆహా అలా అయితే మన కథ ఎలా నడుస్తుంది? మంచి తెలివితేటలు యిచ్చాడు. స్కూలు ఫైనలు పాస్ చేయించాడు. ఆపైన 'చూసుకోనా ప్రతాపం' అన్నాడు.

ఇక శారద విద్యాభ్యాసం కోసం యితరుల నాశ్రయింపక తప్పిందికాదు. పినతండ్రి ఆస్థిపరుడే. వారి యింట్లోనే ఉండి చదవాలనుకుంది. వాళ్లుకూడా ఏకళన వున్నారో ఓ పక్షాన ఒప్పుకునే రకాలు కాకపోయినా "సరేలే ఉండు" అనగలిగారు. ఏదో పదహారేళ్ళ చేతికెదిగిన ఆడపిల్లగదా, పని పాటలకి అక్కరకి రాకపోతుందా అని.

కాలం గడుస్తున్నకొలదీ అందరు యువతుల హృదయాలలోకి మల్లేనే ఆమె హృదయంలో కూడా ప్రేమ ఉద్భవించింది. అభిమానం గల సామాన్య బాలిక ఎవరయినా తనకైతాను తన ప్రేమను పురుషునికి ఎప్పుడూ వెల్లడించలేదు కదా. ఇప్పుడు అతని మనస్సు గ్రహించటమెలాగా అనేదే శారద కెదురైన పెద్దసమస్య. అతడేమో ధనికుల బిడ్డ. పెద్ద కుటుంబంలోని వాడు. ఏమిటో వెర్రితనం కాకపోతే అతనికీ యీమెకూ పొత్తెలా కుదురుతుందంట? ఏమో నాకెప్పుడూ నమ్మకం లేదు.

'ఏమిటే భారతీ! యీ సమస్యనెలా పూరించగలనే' అంటుంది ఆవేదనతో. ఎంత పెద్ద మేథమేటిక్స్ ప్రాబ్లెమ్ యిచ్చినా యిట్టే సాల్వుచేయగల మా శారద యీ జీవిత సమస్యనెదుర్కోలేక పోయింది. ఇది యిలావుంటే

యింట్లో విషయాలు చూద్దాం. పినతల్లి యీమె ఏమీ పనిచెయ్యదని షికాయత్తు చేస్తుంది. 'నిజమేనా శారదా?' అన్నాను. చిత్ర మేమిటంటే దానికి అసలు యింట్లో తను చేయవలసిన పనే కనిపించటంలేదట. ఒకవేళ ఉన్నా అది చాలా స్వల్పమైన పనిట. కాని ఒకటిమాత్రం నిజం. పని ఉన్నా లేకపోయినా అస్తమానం యిల్లాలివెంట తిరుగుతూ లోకాభిరామాయణం వల్లేవేస్తూ లేని పనిని చేస్తున్నట్లు నటించి మోసగించటం శారదకు చేతకాని పని. ఉన్న కాస్త పనీ త్వరగా ముగించుకుని తన గదిలో కూర్చుంటుంది. అది ఆవాడలోని అమ్మలక్కలకందరికీ కూడా గిట్టనిమాట నిజమే.

వాళ్ళబంధువులలో ఒక యువకుడున్నాడు. అతడు కాస్త మంచివాడేట (అని మా శారదే అంటుంది) అతడితో రెండుసార్లు డాబామీద కూర్చుని సాయంత్రం పూట మాట్లాడిందట. ఇంకేం ఒక ప్రతివ్రత ఆ దృశ్యం చూచింది. పాపం ఆయిల్లాలు కవయిత్రి కాబోలు చక్కని కథ అల్లి ప్రచారం చేసింది.

శారద నాతో: "భారతీ! వీళ్ళు నన్నిలా అపార్థం చేసుకుంటారెందుకే. అందరిలాగా నేను ప్రవర్తించలేననేగా. లేని 'నీతి'ని అరువు తెచ్చుకుని నటించటం నాకు చేతకాదు. బానిసలాగా తిరుగుతూ వారి మెరమెచ్చుల కోసం నా వ్యక్తిత్వాన్ని నేను చంపుకోలేను. ఒకరిమీద మరొకరికి నేరాలుచెప్పి తగాదాలు పెట్టలేను" అంటుంది.

"ఎందుకు శారదా అంత ఆవేశ పడతావు? ఇది లోకం. మంచివాళ్ళు లోకంలో ఎప్పుడూ అపార్థం చేసుకోబడతారు. వారు మరణించిన తరువాతనే వారివిశిష్టతను లోకం గుర్తిస్తుంది".

"అదే నిజమైతే నా నిర్దోషిత్వం వెల్లడించటం కోసం మరణించటానికి కూడా వెనుదీయను భారతీ! ఇలా నన్ను హింసించకపోతే ఆ భగవంతుడు నన్ను ఒక్కసారిగా చంపకూడదూ" అంటుంది. వెర్రిపిల్ల! చచ్చి ఎవరిని సాధించగలదు?

ఒకనాడు అకస్మాత్తుగా నా వద్దకు వచ్చి: "భారతీ! నేనుచనిపోయానని నీకు హఠాత్తుగా తెలిస్తే అప్పుడు నన్ను గురించి నీవేమనుకుంటావు?" అని అడిగింది. అంత హఠాత్తుగా అడిగిన ప్రశ్నకు సమాధానం కొరకు నేను తడుముకున్నాను.

"బ్రతికినన్నాళ్ళూ కష్టపడిందేకాని, సుఖమంటే ఏమిటో ఎరగదు. 'అమాయిక' అనుకుంటాను" అన్నాను మెల్లిగా.

తరువాత వారానికే యీ కబురు విన్నాను. నాలుగు రోజులక్రితం నన్ను కలుసుకున్నప్పుడు నాతో అంది. తన ప్రియుడు తన ప్రేమను తిరస్కరించాడుట. అతడితో సరి సమానంగా తూగగల ధనవంతురాలు కాకపోవడమేనట కారణం. స్వార్థపరత్వంతో నిండిన ఈ ప్రపంచంలో ఉండటం తనకిక సాధ్యం కాదట. ఇంకా ఏమేమో అంది. ఫలితం యీ వార్త. శారద ఎప్పుడూ లోకాన్ని ద్వేషించేది. మళ్ళీ తనలోతాను అప్పుడప్పుడు "ఈ ప్రపంచమంటే నాకింతద్వేషందేనికో"అని తన్నుతాను ప్రశ్నించుకుంటూ ఉండేది. వచ్చే సమాధానం...?

"శారదా! జీవితం మధురం. లోకం నిర్మల దర్పణం. జీవితాన్ని గురించి మనమెలా ఊహించుకుంటే అలా ప్రతిబింబిస్తుంది. నీవు విచారిస్తే జీవితం విచారమయంగా కనిపిస్తుంది. ఆనందిస్తే నీకు నలువైపులా మహత్తరానందం సాక్షాత్కరిస్తుంది. సౌందర్య పూరితమైన యీ ప్రకృతి, విజ్ఞానదాయకాలైన యీ శాస్త్రాలు, సంగీత సాహిత్యాలూ ఆనంద సంధాయకాలు కావా—"

"చాల్లే భారతీ! యీ ప్రపంచం దుర్మార్గులు నివసించటానికి తగిన చోటేకాని నేను కోరే ప్రశాంతమైనప్రదేశం యిదికాదు. దాన్ని చేరటానికి మనకు శక్యం కాదు" అని నన్ను సగంలోనే వారించేది.

అలాంటి నా ప్రాణమిత్రురాలు మరణించినందుకు నిజంగా నేను విచారించలేదు. ఈపాపకూపంలోనించి బైటపడి చిరకాలంనించీ వాంఛిస్తున్న శాంతి నికేతనానికి ఆమె ఆత్మ యిప్పటికైనా చేరినందుకు ఎంతో ఆనందించాను. కాని ఒక్కటి మటుకు నాకు చాలా అనుమానంగానే ఉండిపోయింది. ప్రపంచంలో ఎవరిస్వభావమూ సామాన్యంగా నచ్చని శారద అలాంటిస్వార్థపరుణ్ణెలా ప్రేమించగలిగిందా అని!